క్లుప్తంగా

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

మానవపాడు: అమరవాయి– కలుకుంట్ల రహదారిపై అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడ్డ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అమరవాయి మీదుగా కలుకుంట్ల వెళ్లే రహదారి మార్గమధ్యలో వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పడంతో బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్, మరో వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు పేర్కొన్నారు.

ఎల్ఓసీ అందజేత



అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి కింద మంజూరైన ఎల్ఓసీని ఎమ్మెల్యే విజయుడు ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఇటిక్యాల మండలం సాతర్లకు చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రూ.1.50 లక్షల ఎల్ఓసీ మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తల్లి నీకు వందనం అంటూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో తల్లులు, యువతులు, చిన్నారులు పాల్గొన్నారు.

వర్షపు నీరు వెళ్లే దారేది..



గట్టు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న సీసీరోడ్డు కారణంగా వర్షపు నీరు బస్టాండ్ ఆవరణ నుంచి బయటకు వెళ్లేందుకు అడ్డంకిగా మారింది. కొత్తగా వేస్తున్న సీసీరోడ్డు పాత రోడ్డు కంటే ఎత్తులో వేస్తున్న కారణంగా వర్షపు నీరు బయటకు పోయేందుకు దారి లేకుండా పోయింది. బస్టాండ్ ఆవరణలో రోడ్డు పక్కనే ఉన్న పాత ఇళ్లు పూర్తిగా తగ్గులోకి వెళ్లాయి. రైతు వేదిక నుంచి మసీదు వరకు మాచర్ల దారిలో కొత్తగా సీసీ రోడ్డును వేస్తున్నారు. పాత రోడ్డుపై ఉన్న మట్టి తొలగించి వేయకుండా అలానే కొత్తగా రెండు కోటింగ్‌లతో సీసీరోడ్డు వేశారు. ఈ నేపథ్యంలో బస్టాండ్ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాని దుకాణదారులు, ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

మహమ్మదాబాద్: కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కురుమూర్తి, వెంకటేశ్‌లు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఈనెల 20న చేపట్టబోయే సమ్మె వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు తీర్చడంలో ఆలస్యం చేస్తున్నారని, కనీస వేతనాలు, పర్మినెంట్ ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాంటిటీ, పెన్షన్, 8 గంటల పని యథావిధిగా ఉండాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారన్నారు. దీంతో వ్యవసాయ కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో వరద గాలన్న, చంద్రమ్మ, రఘు, రాములు, కిష్టయ్య, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు.. నిర్మానుష్యంగా రహదారులు



అమరచింత: ఎండ కారణంగా రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు ఇండ్ల నుంచి బయటకి రావడానికి కూడా భయపడుతున్నారు. కానీ పెళ్లిలు, శుభకార్యక్రమాలు ఉండటంతో తప్పని పరిస్థితుల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటికి వస్తున్న పరిస్థితులు దాపరించాయి. అమరచింత పట్టణంలోని మరికల్–ఆత్మకూర్ రహదారి ఆదివారం ఎండ తాకిడికి జనం లేక నిర్మానుష్యంగా మారింది. జనాలు రోడ్డపైకి రాకపోవడంతో మధ్యాహ్నం వేళ వ్యాపారాలు కూడా జరగట్లేదని వ్యాపారులు వాపోతున్నారు.

చెత్త సేకరణ కరువాయె

- వేధిస్తున్న కార్మికుల కొరత
- చెత్త సేకరణ ఆటోల సంఖ్య తక్కువే
- మరమ్మతుకు నోచుకోని వాహనాలు



రోడ్డు పక్కనే చెత్త తగులబెడుతున్న దృశ్యం

అయిజ: జిల్లాలో రెండో పెద్ద మున్సిపాలిటీ అయినా అయిజలో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్తను కూడా సేకరించడం లేదని మున్సిపాలిటీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు రోజులకోసారి చెత్తను సేకరిస్తుండటంతో దుర్వాసనతో అల్లాడుతున్నట్లు మున్సిపల్ వాసులు వాపోతున్నారు.

20 వార్డుల్లో అదే పరిస్థితి

అయిజ మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా 8,065 నివాస, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ప్రజల నుంచి రూ.1.75 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పన్ను వసూళ్లలో ఉన్న ఉత్సాహం పారిశుద్ధ్య నిర్వహణలో లేదని ప్రజలు మండిపడుతున్నారు.

రెండు రోజులకోసారి

ఆటోల సంఖ్య, పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉండడంతో మున్సిపాలిటీలో రెండు రోజులకోసారి చెత్త సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు చెత్తను మురుగు కాలువలు, రోడ్ల పక్కన పారబోస్తున్నారు. మురుగు కాలువల్లో చెత్తను వేయడంతో మురుగు కలదకుండా కాల్వలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. అదే విధంగా రోడ్డు పక్కన వేసిన చెత్తకు నిప్పు పెడుతుండడంతో విష వాయువులు వెలువడి అనారోగ్యం పాలవుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

కార్మికుల కొరత..

పట్టణంలోని 20 వార్డులకు గాను దాదాపు 100 మంది కార్మికులు విధులు నిర్వహించాల్సి ఉండగా కేవలం 62 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీంతో చెత్త సేకరణ ఆలస్యమవుతుంది.

7 ఆటోలు మాత్రమే

మున్సిపాలిటీలో ఇళ్లు, వాణిజ్య సముదాయాల నుంచి చెత్త సేకరణకు మొత్తం 20 ఆటోలు ఏర్పాటు చేయాల్సి ఉండగా 10 ఆటోలు మాత్రమే ఉన్నాయి. వాటిలో మూడు ఆటోలు మరమ్మతుకు నోచుకోక మూలనపడ్డాయి. ఉన్న 7 ఆటోలతోనే చెత్త సేకరిస్తున్నారు. ఇటు ఆటోలు, ఇటు కార్మికుల సంఖ్య తక్కువగా ఉండడంతో పారిశుద్ధ్య సమస్య తాండవిస్తుంది.

లక్షల్లో ఖర్చు

పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు మున్సిపాలిటీ అధికారులు ప్రతి నెలా సుమారు రూ.15 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఆటోల ద్వారా చెత్తను సేకరించే కార్మికులకు ప్రతినెల రూ. 1.70 లక్షల వేతనాలు చెల్లిస్తున్నారు. ఆటోల సర్వీస్‌కు రూ.60 వేలు ఖర్చు చేస్తున్నారు. అదే విధంగా చెత్తను సేకరించే ఆటోలు, ట్రాక్టర్లు నిలిపేందుకు షెడ్డు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు నిర్మించలేదు. దీంతో వాహనాలు ఎండా, వానకు తడుస్తూ మరమ్మతుకు గురవుతున్నాయి.



మరమ్మతుకు గురైన ఆటోలు



చెత్త సేకరిస్తున్న ఆటో

ఆటోలు ఏర్పాటు చేయాలి



మున్సిపాలిటీలో చెత్త సేకరణకు 20 ఆటోలు ఏర్పాటు చేయాల్సి ఉండగా 10 ఆటోలు మాత్రమే ఉన్నాయి. దీంతో రెండు రోజులకోసారి చెత్తను సేకరిస్తుండడంతో ప్రజలు చెత్తను మురుగు కాలువలు, రోడ్డు పక్కన వేస్తున్నారు.

– సురేష్, అయిజ

కార్మికులను నియమించాలి



చెత్తను సేకరించేందుకు కార్మికులు తక్కువ సంఖ్యలో ఉన్నారు. ప్రతి రోజు చెత్త సేకరించరించడం లేదు. ఈ నేపథ్యంలో పట్టణంలో చెత్తా చెదారం ఎక్కబడితే అక్కడ కనిపిస్తోంది. కనీసం వార్డుకు 5 మంది పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేయాలి.

– వెంకటేష్, అయిజ

నిధులు సమకూర్చాలి



మున్సిపాలిలటీలో చెత్త సేకరణ తదితర సమస్యలు పరిష్కరించేందుకు నిధులు సమకూర్చుకోవాలి. ప్రత్యేక నిధులంటూ ఖజనాలో లేవు. కార్మికుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తెలియజేస్తాం.

– సీహెచ్ సైదులు, మున్సిపల్ కమిషనర్

తైక్వాండో శిక్షణ అభినందనీయం



అయిజ విద్యార్థులతో డీవైఎస్ఓ జితేంద్ర

అయిజ: వేసవి సెలవుల్లో చిన్నారులకు తైక్వాండోలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని డీవైఎస్ఓ జితేంద్ర అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఆదివారం జితేంద్ర సందర్శించారు. ఈ సందర్భంగా మాస్టర్ సుధీర్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు విజయ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

మల్దకల్: మండల కేంద్రంలోని క్రీడా ప్రాగంణంలో ఆదివారం ఫుట్‌బాల్ శిబిరాన్ని డీవైఎస్ఓ జితేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు తాము ఎంచుకున్న క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం పొందవచ్చన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో పీఈటి విజయ్, రఘు, తిరుమలేష్, లక్ష్మన్న, మహేష్, ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పుర వీధుల గుండా ఊరేగించారు. సోమవారం రాత్రి తేరు ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటయ్యేనా.?

- కొత్తకోటలో విద్యార్థుల అవస్థలు
- ఎన్నికల హామీగానే సరిపెడుతున్న నాయకులు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు



కొత్తకోట పట్టణ వ్యూ

కొత్తకోట రూరల్: మారుతున్న సమాజంలో ఉన్నత చదువులు ఎంత అవసరమో మనందరికీ తెలిసిందే. దేవరకద్ర నియోజవర్గంలోని కొత్తకోట, మదనాపురం, అడ్డాకుల, ముసాపేట మండలాల్లో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థుల ఉన్నత చదువుల కల ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. కొత్తకోట మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రతి ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం తర్వాత మర్చిపోవడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఆరు మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న కొత్తకోట అన్ని రంగాల్లో దినదినాభివృద్ధి చెందుతున్నప్పటికీ విద్యారంగంలో మాత్రం వెనకబడిపోయింది. గతంలో దేవరకద్ర నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ నియోజవర్గాన్ని పలు రంగాల్లో అభివృద్ధి చేసినా కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాత్రం ఏర్పాటు చేయలేకపోయారు. ప్రస్తుతం నియోజవర్గానికి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన జి.మధుసూదన్‌రెడ్డి అసెంబ్లీలో కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు గురించి ప్రస్తావించారు. 2025–26 విద్యా సంవత్సరంలోనైనా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

చదువుకు మధ్యలోనే స్వస్తి..

దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట, మదనాపురం, అడ్డాకుల, ముసాపేట మండలాల్లో ప్రతి ఏటా 1,500 మందికి పైగా ఇంటర్ ఉత్తీర్ణులవుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదవాలంటే వనపర్తి, మహబూబ్‌నగర్, గద్వాల వెళ్లాల్సి వస్తుంది. ఆయా పట్టణాలకు వెళ్లడం పేద, మధ్య తరగతి విద్యార్థులు భారంగా మారి చదువును మధ్యలోనే ఆసేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తుందని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

ఆర్థిక భారం



కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాను.దీంతో ఆర్థికంగా భారంగా మారింది. ఖర్చులు భరించలేని చాలామంది ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు.

కె.పల్లవి, డిగ్రీ విద్యార్థిని, అప్పరాల

కూలి పనులు చేస్తూ..



పదో తరగతి వరకు ప్రభుత్వ స్కూల్‌లోనే చదివాను. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ నన్ను చదివిస్తున్నారు. డిగ్రీ ప్రైవేట్‌లో చదవాలంటే ఖర్చులు ఎక్కువగా అవుతాయి. కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంటే మాలాంటి వాళ్లకు ఉపయోగంగా ఉంటుంది.

– సాయిచందన, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రతి ఎన్నికల్లో నేతలు హామీలు ఇచ్చిన అమలు చేయడంలో విఫలమయ్యారు. దీంతో ఉన్నత చదువులు విద్యార్థులకు భారంగా మారుతున్నాయి. ఈ ప్రాంతంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

– అజయ్‌కుమార్, ఏబీవీపీ, పూర్వ జిల్లా కన్వీనర్.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని వేణిసోంపురంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. మండలంలో వరి పంట చేతికొచ్చి 40 రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. టోకెన్లు ఇవ్వడానికి కూడా ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం గోనె సంచులు ఏర్పాటు చేయలేని దుస్థితిలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అన్యాయం జరిగితే రైతుల పక్షాన నిరసన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌గౌడ్, శ్రీను, శ్రీహరి, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బేతేలు చర్చి ప్రారంభోత్సవం



చర్చి ప్రారంభోత్సవంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

అయిజ: మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన ఎంబీ బేతేలు చర్చి ప్రారంభోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అబ్రహం ముఖ్య అతిథిలుగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో అతిపెద్ద చర్చి నిర్మాణం చేపట్టడం హర్షణీయమన్నారు. నిర్మాణంలో భాగస్వాములైన అందరికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రెవ ఆర్ఎస్ లేమూయేలు, ఎంబీ సంఘం ముఖ్య ఇవాంజిస్టులు, పాస్టర్లు, బేతేలు సంఘం, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి మరమ్మతు చేయాలి



పగుళ్లిచ్చిన అంగన్‌వాడీ భవన గోడలు

మానవపాడు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2 భవనం శిథిలావస్థకు చేరుకోవడంలో ఇటు అంగన్‌వాడీలు, గర్భిణులు, బాలింతలు భయాందోళనలో ఉన్నారు. భవన గోడలు పైకప్పు పగుళ్లు వచ్చి ప్రమాకరంగా ఉంది. ఎప్పుడో ఏ ప్రమాదం జరుగుతుందోనని చిన్నారులు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేయాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000–01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటు ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు



మానవపాడులో జాతీయ రహదారికి వెళ్లే దారిలో మూల మలుపు

మానవపాడు: జాతీయ రహదారి నుంచి మండల కేంద్రానికి వెళ్లే దారిలో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. మలుపుల వద్ద జురాల కాల్వ ఉండటంతో ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు గాయాలపాలై ఆస్పత్రుల్లో చేరుతున్నారు. జురాల కాల్వ చుట్టూ రక్షణ గోడ, వేగ నిరోధాలు, సూచిక బోర్డులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో దోపిడీని అరికట్టాలి



కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు కాకం బాలస్వామి

పాన్‌గల్: వరి కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు చేస్తున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కార్యకర్తలతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ధాన్యం కాంటా చేసే క్రమంలో ఖాళీ సంచి పేరుతో 600 గ్రాములు అదనంగా తూకం చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా 1,250 గ్రాములు తూకం చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. దీంతో పాటు కేంద్రాల్లో ధాన్యం కాంటా చేసి మిల్లులకు తరలించిన తర్వాత మిల్లర్లు తాలు పేరుతో బస్తాకు కిలో చొప్పున తరుగు తీస్తూ.. రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. కేంద్రాల్లోని ధాన్యం కాంటాను వేగవంతం చేయాలని కోరారు. రైతులు ఈ విధంగా నష్టపోతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోపిడీని అరికట్టకపోతే రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. దీంతో గ్రామంలోని క్రీడా ప్రాంగణాన్ని ప్రైవేటు వ్యక్తులు కూల్చివేసి నెలలు గడుస్తున్నా నేటికీ పునరుద్ధరించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణం బోర్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటూ క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సహదేవుడు, హన్మంతు, శంకరయ్య, బొజ్జన్న, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుదత్తాత్రేయ పాదపూజ మహోత్సవం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో ఆదివారం మంజుల గోవింద్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వేణుదత్తాత్రేయ పాదపూజ, సువర్ణలక్ష్మి, అష్టలక్ష్మి సిద్ధి వ్రతదీక్షావిరమణ మహోత్సవం వైభవంగా నిర్వహిచారు. లోకకల్యాణార్థం నిర్వహించిన కార్యక్రమంలో అవదూత రామదూత స్వామి అనుచరుడు తిరుమలరాజు సందేశం ఇచ్చారు. విశ్వగురువు విష్ణుస్వరూపుడు అయిన అవధూత రామదూత స్వామి లోకకల్యాణార్థం పాటుపడుతున్నాడని కొనియాడారు. కార్యక్రమ నిర్వహకులు మంజుల మాట్లాడుతూ అవదూత వల్ల కలిగిన ప్రయోజనాలు సభకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా వేణుగోపాల దత్తాత్రేయ ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి హాజరై గురువుకు అభిషేకం చేశారు. రామదూత గురువు వేణుదత్తాత్రేయ పాదపూజ కార్యక్రమం కనుల పండువగా సాగింది. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య సువర్ణలక్ష్మి, అష్టలక్ష్మి సిద్ధి వ్రతదీక్ష చేపట్టిన మహిళలు దీక్షలను విరమించారు. వేడుకల సందర్భంగా కళాశాల మైదానం అంతా ఆధ్యాత్మికతతో నిండిపోయింది. సాయంత్రం రథోత్సవం రమణీయంగా సాగింది.